క్లుప్తంగా

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

రాజమహేంద్రవరం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 వైద్య శిబిరాలు బుధవారం రాజమహేంద్రవరంలోని ఆవ వాంబేకాలనీ, వీఎల్ పురం, కంబాలపేట, శంభూనగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్లలోను, నిడదవోలు నెహ్రూనగర్ యూపీహెచ్‌సీలో, కొవ్వూరు క్రిస్టియన్‌పేట యూపీహెచ్‌సీలో జరుగుతాయి. ఈ మేరకు డీఎంహెచ్‌ఓ డా.కె.వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు.

2,876 మందికి వైద్య సేవలు

జగనన్న ఆరోగ్య సురక్ష 2.0లో భాగంగా మంగళవారం నిర్వహించిన 8 వైద్య శిబిరాల్లో 2,876 మంది వైద్య సేవలు పొందారని డా.వెంకటేశ్వరరావు తెలిపారు. 27 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేశారని, 2,876 మందికి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్టు చెప్పారు.

రాష్ట్ర స్థాయి ఉత్తమ అధికారిగా మల్లిడి



పురస్కారం అందుకుంటున్న మల్లిడి జగన్మోహనరెడ్డి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం ఆల్కాట్‌తోట వాణిజ్య పన్నుల శాఖ జీఎస్టీ ఉన్నతాధికారి మల్లిడి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర స్థాయి ఉత్తమ అధికారిగా పురస్కారం అందుకున్నారు. నిర్దేశిత లక్ష్యాలను మించి ఆదాయాన్ని సాధించడంతో ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. గుంటూరులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఏపీ ఆర్థిక శాఖ కార్యదర్శి ఎస్.గుల్జార్ నుంచి వాణిజ్య పన్నుల శాఖ రాష్ట్ర కమిషనర్ గిరిజాశంకర్, కస్టమ్స్ సెంట్రల్ టాక్స్ కమిషనర్ సంజయ్ పంత్ ఆధ్వర్యంలో ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ముఖ్యఅతిథిగా ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

మానసిక వికలాంగులకు భోజన వితరణ

సీటీఆర్ఐ: రజనీకాంత్ సేవా ట్రస్టు తరఫున ప్రతి నెలా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ట్రస్టు వ్యవస్థాపకుడు, రజనీకాంత్ వీరాభిమాని ఆర్.రాజు అన్నారు. సహృదయ ఫౌండేషన్, రజనీకాంత్ సేవా ట్రస్టు సంయుక్తాధ్వర్యంలో మంగళవారం హౌసింగ్ బోర్డు కాలనీలోని జననీ మానసిక వికలాంగులకు భోజనాలు ఏర్పాటు చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా ఈ కార్యక్రమం చేయడం సంతృప్తి కలిగించిందని రాజు పేర్కొన్నారు. ఫౌండేషన్ నిర్వాహకులు మరుకుర్తి నరేష్‌కుమార్ యాదవ్, రవియాదవ్ సామాజిక సేవను స్ఫూర్తిగా తీసుకుని తాను కూడా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తన ఆదాయంలో సగం ట్రస్టు సేవలకు వినియోగిస్తామన్నారు.

రెండో విడత ఆరోగ్య సురక్ష ప్రారంభం



దుళ్లలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కడియం: పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని నేరుగా పల్లెల్లోనే అందించాలన్న లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష కార్యక్రమం రెండో విడత మంగళవారం ప్రారంభమైంది. దుళ్ల సచివాలయం-2 పరిధిలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి, గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 485 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 30 మందికి నేత్ర పరీక్షలు చేసి, ఆరోగ్యశ్రీకి ఇద్దరిని రిఫర్ చేశారు. డా.స్వరూప ఆధ్వర్యంలో ఆప్తమాలజీ, గైనకాలజీ, జనరల్ ఎండీ, ఫిజీషియన్ వైద్యులు వారి బృందంతో వైద్య పరీక్షల్లో పాల్గొన్నారు. ఎంపీడీఓ కె.రత్నకుమారి, ఈఓపీఆర్డీ ఎన్‌పీఎస్ లక్ష్మి, సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ అభివృద్ధికి తోడ్పడాలి

రాజమహేంద్రవరం రూరల్: రబీ సీజన్‌లో వ్యవసాయ విస్తరణ అధికారులు సమన్వయంతో పని చేసి, వ్యవసాయ అభివృద్ధికి తోడ్పడాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవరావు అన్నారు. మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో జిల్లాలోని వ్యవసాయ విస్తరణ అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. గత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో నాణ్యమైన దిగుబడి సాధించామని, ఈ రబీ సీజన్‌లో కూడా అధిక దిగుబడు లు సాధించేలా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం అధ్యక్షుడు వేణు మాధవరావు ఆధ్వర్యంలో డీఏఓ మాధవరావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నూతన కార్యవర్గం

ప్రకాశం నగర్: జవహర్ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం మంగళవారం స్థానిక వేంకటేశ్వరనగర్ పార్కులో జరిగింది. క్లబ్ అధ్యక్షుడిగా ఉండవల్లి సత్యనారాయణ, కార్యదర్శిగా జి. సూర్యనారాయణ మూర్తి, కోశాధికారిగా పాలూరి నాగేశ్వరరావు, జాలీ వాకర్‌గా భానుప్రసాద్, ఇతర సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ 103 జిల్లా గవర్నర్ చదరం శివాజీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఇలాగైతే సహించను..

- సమస్యను వెంటనే పరిష్కరించకుంటే ఎలా!
- నెలల తరబడి ప్రజలు ఇబ్బందులు పడాలా?
- గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో ఎంపీ భరత్ అసహనం



46వ డివిజన్‌లో గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో పర్యటిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజలు నెలల తరబడి ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోరా..? ఇలాగైతే ఎలా..? అంటూ సచివాలయ సిబ్బందిపై వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్, రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్‌రామ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నగరంలోని 46వ డివిజన్ క్వారీ మార్కెట్ శానిటోరియం వద్ద నుంచి మంగళవారం నిర్వహించిన గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో ఎంపీ భరత్ ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని, స్థానిక సమస్యలపై కూడా ఆరా తీశారు. ఒకచోట పైపు లీకేజీ కావడాన్ని గుర్తించిన ఎంపీ.. ఎంతకాలం నుంచి ఇలా ఉందని ప్రశ్నించారు. ఆరు నెలలుగా లీకేజీ ఉందని, ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఓ మహిళ చెప్పడంతో, ఆర్ఎంసీ సంబంధిత అధికారులు, సిబ్బందిపైనా, అక్కడే ఉన్న సచివాలయ సిబ్బందిపై ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు నెలలుగా సమస్య ఉన్నా, ప్రజలు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోతే ఎలా అని నిలదీశారు. తక్షణం మరమ్మతులు చేయాలని ఆదేశించారు. మంచినీరు సక్రమంగా రావడం లేదని పలువురు మహిళలు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ అధికారులకు ఎంపీ ఫోన్ చేసి, సాయంత్రంలోగా సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

టీడీపీ కార్పొరేటర్ల తీరుతో అన్యాయం

తమ ఇంటి స్థలంలో విద్యుత్ స్తంభం వేసి గత టీడీపీ కార్పొరేటర్లు తమకు అన్యాయం చేశారని ఆనంద్‌నగర్ డౌన్ ఏరియా (మదర్ థెరిసా సెంటర్ వద్ద) ఓ మహిళ ఎంపీ వద్ద మొరపెట్టుకుంది. స్థలం ఉన్నా ఇల్లు కట్టుకోవడానికి అవకాశం లేకుండా చేశారని పేర్కొంది. తాను వైఎస్సార్ సీపీకి, జగన్‌కు అభిమానినని తెలిసి కక్షతో ఇలా చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. వైఎస్సార్ సీపీ కార్యాలయానికి తన ఇంటిని ఉచితంగా ఇచ్చానని తెలిపింది. తన ఇంటి స్థలంలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించమని వేడుకుంది. ఎంపీ భరత్ వెంటనే విద్యుత్ విభాగం ఈఈకి ఫోన్ చేసి, సమస్యను వివరించారు. వెంటనే రామదాసుమెట్ట వద్ద ఏరియాలో విద్యుత్ స్తంభాన్ని తొలగించి, మరోచోట ఏర్పాటు చేయమని ఆదేశించారు. పుంతరోడ్డు వద్ద స్థలాన్ని పరిశీలించారు. సర్వే చేసి సమగ్ర నివేదిక ఇవ్వాల్సిందిగా ఎంపీ భరత్ అధికారులను కోరారు. ఓ వికలాంగుడు సదరం సర్టిఫికెట్ కోసం అభ్యర్థించగా, సంబంధిత శాఖ అధికారులకు ఫోన్ చేసి మంజూరు చేయాల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు 46వ వార్డు ఇన్‌చార్జి మేడబోయిన సునీల్, నక్కా శ్రీనగేష్, మహిళా విభాగం నగర శాఖ అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, యూత్ ప్రెసిడెంట్ పీత రామకృష్ణ, ఎన్వీ శ్రీనివాస్, కాసే రాజేష్, తిరగాటి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

చిత్రాంగి గెస్ట్ హౌస్ వద్ద అద్భుత పార్కు!

రాజమహేంద్రవరం సిటీ: రాజమండ్రి నగరంలో మరో అద్భుత పార్కు నిర్మాణానికి మున్సిపల్ కార్పొరేషన్ కసరత్తు చేపట్టింది. పుష్కరఘాట్-చిత్రాంగి గెస్ట్‌హౌస్ మధ్య సుమారు రెండెకరాల స్థలం నిరుపయోగంగా ఉంది. అసాంఘిక శక్తులకు ఇది నిలయంగా మారింది. ఇటీవల ఉమా మార్కండేయేశ్వర స్వామి ఆలయానికి వచ్చిన ఎంపీ భరత్ దృష్టికి పలువురు ఈ విషయాన్ని తీసుకెళ్లారు. స్థలాన్ని పరిశీలించిన ఆయన వెంటనే రైల్వే ఉన్నతాధికారులతో చర్చించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఎంపీ భరత్.. రైల్వే, మున్సిపల్ అధికారులతో కలిసి ఆ స్థలాన్ని పరిశీలించారు. నగరంలో ప్రస్తుతం ఉన్నవాటికి భిన్నంగా ఇక్కడ పార్కును ఆకట్టుకునేలా నిర్మించాలని ఎంపీ భరత్ సూచించారు. పక్కనున్న గోదావరి అందాలు వీక్షించేలా, అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పార్కును రూపొందించాలని ఆర్ఎంసీ అధికారులకు చెప్పారు. సాధ్యమైనంత త్వరగా పనులు ప్రారంభిస్తామని ఆర్ఎంసీ అధికారులు పేర్కొన్నారు. ఎంపీ వెంట కమిషనర్ దినేష్‌కుమార్, ఆర్ఎంసీ ఎస్ఈ పి.పాండురంగారావు, రైల్వే అధికారులు ఉన్నారు.



రైల్వే అధికారులు, మున్సిపల్ కమిషనర్‌తో కలిసి పార్కు లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ఎంపీ భరత్

ఆహ్లాదం, ఆరోగ్యాన్ని పెంచేవే పార్కులు

మోరంపూడి సాయినగర్ పార్కును ప్రారంభించిన ఎంపీ భరత్



మోరంపూడి సాయినగర్ పార్కును ప్రారంభిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: పార్కులతో ఆరోగ్యంతో పాటు మానసికానందం లభిస్తుందని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్, రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. మంగళవారం మోరంపూడి సాయినగర్ పార్కును ఆయన ప్రారంభించారు. రాజమండ్రి నగరపాలక సంస్థ సుమారు రూ.70 లక్షలతో ఈ పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ ఈ పార్కులో పలు క్రీడల కోర్టులు ఉన్నాయని, వాకింగ్ ట్రాక్ అద్భుతంగా నిర్మించారని మున్సిపల్ కమిషనర్‌ను, ఆర్ఎంసీ అధికారులను అభినందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ కారణంగానే రాజమండ్రి నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. మార్చిలో మోరంపూడి ఫ్లై ఓవర్ బ్రిడ్జి ప్రారంభం కానున్నట్టు వెల్లడించారు. ఇది ప్రారంభమైతే ప్రజలు సురక్షిత ప్రయాణం చేయవచ్చన్నారు. తాను పుట్టి పెరిగిన నగరాన్ని విశ్వనగరంగా అభివృద్ధి చేయాలన్నదే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు. నగర కమిషనర్ దినేష్‌కుమార్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, ఎస్ఈ పాండురంగారావు, మార్గాని సురేష్, వార్డ్ ఇంచార్జి అరే చిన్ని, చిర్రరాజు, బొప్పన సుబ్బారావు, గౌరీ శంకర్, పీవీఆర్ రెడ్డి, మనే దొరబాబు, సుద్దరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు పెట్టండి

ఏఎస్పీ జి.వెంకటేశ్వరరావు



విద్యాసంస్థల యాజమాన్యాలతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): విద్యార్థులు చెడు అలవాట్ల బాట పట్టకుండా జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లోను అవగాహన సదస్సులు నిర్వహించాలని ఏఎస్పీ జి.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో విద్యాసంస్థల యాజమాన్యాలతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ సమాజానికి నష్టం కలిగిస్తున్న సైబర్ నేరాలు, గంజాయి వంటి వాటికి విద్యార్థులు ఆకర్షితులు కాకుండా చూడాలన్నారు. వీటి దుష్పరిణామాలపై ప్రతి కళాశాల యజమాన్యం, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు ఆయా విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఇందుకు పోలీసు శాఖ సహకరిస్తుందన్నారు. ఈస్ట్ జోన్ డీఎస్పీ ఎన్.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుని నేరగాళ్లు డబ్బు దోచుకుంటున్నారన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇతర యాప్‌లు, లింకులు, ఈ-మెయిళ్లతో హ్యాకర్లు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. వీటితో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనవసర లింకులపై క్లిక్ చేయడంతో అనేక రకాలుగా ఇబ్బందుల పాలవుతారని హెచ్చరించారు. అపరిచితులతో ఫోన్‌కాల్స్, వాట్సాప్, ఫేస్‌బుక్, చాటింగ్‌లకు దూరంగా ఉండాలని హితవు పలికారు.

టోల్ ఫ్రీ నంబరు

సైబర్ నేరాల బారిన పడితే 1930 ట్రోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలని కిషోర్‌కుమార్ తెలిపారు. ఓటీపీలను ఎవరికీ షేర్ చేయవద్దన్నారు. వ్యక్తిగత, బ్యాంక్ ఖాతాల వివరాలు అపరిచితులతో పంచుకోవద్దన్నారు. ఫోన్లలోని ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించరాదన్నారు. ఎం-ఆధార్ యాప్ డౌన్లోడ్ ద్వారా ప్రతిఒక్కరూ బయోమెట్రిక్‌ను లాక్ చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. దిశ యాప్‌ను ప్రతి విద్యార్థి డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సౌత్ జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు, పోలీస్ ఆఫీసర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రఘురాం, వివిధ స్కూలు, కాలేజీల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలి

కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జనవరి 5 కల్లా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మాధవీలత తెలిపారు. ఇంకా కేంద్రాలు కొనసాగించాల్సి ఉంటే ప్రతిపాదన ఇవ్వాలని చెప్పారు. మంగళవారం సాయంత్రం మండల అధికారులతో ధాన్యం కొనుగోలు, పౌర సరఫరాల శాఖ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్‌లో ద్వారా జేసీ తేజ్‌భరత్‌తో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్లో 231 కొనుగోలు కేంద్రాలు ద్వారా ధాన్యం కొనుగోలు చేపట్టామని, 190 ఆర్బీకేల్లో కేంద్రాలు మూసివేశామన్నారు. ఇంకా 41 కేంద్రాలు కొనసాగుతున్నట్టు తెలిపారు. జిల్లాలో రబీకి రైతులు సిద్ధమైనందున,, ఇంకా కొనుగోలు కేంద్రాలు ఎందుకని ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో తహసీల్దార్, ఎంపీఓలు తనిఖీ చేసి, కేంద్రాల కొనసాగింపుపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. జేసీ తేజ్‌భరత్ మాట్లాడుతూ జిల్లాలో నూరు శాతం కోతలు పూర్తయ్యాయని, ఇప్పటివరకు 2.33 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు. వివిధ ప్రభుత్వ కార్యక్రమాలపై జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. పెంచిన సామాజిక పెన్షన్ల పంపిణీకి స్థానిక ప్రజాప్రతినిధులను కలుపుకొని వెళ్లాలని పేర్కొన్నారు.

తల్లి చెంతకు క్షేమంగా చేరుకున్న బాలిక

ధవళేశ్వరం: గ్రామంలోని క్వారీ రోడ్డు పెంతెకోస్తు చర్చి వద్ద తప్పిపోయిన బాలిక ఆచూకీని రెండు గంటల్లో పోలీసులు కనిపెట్టారు. ఆమెను సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. వివరాల్లోకి వెళితే.. కడియం గ్రామానికి చెందిన ఎస్‌కే సుమియా తన మూడేళ్ల కుమార్తెతో కలిసి క్వారీ కెనాల్ రోడ్డులోని పెంతెకోస్తు చర్చికి మంగళవారం వచ్చింది. అనంతరం పాప కనపడకపోవడంతో ధవళేశ్వరం పోలీసులను ఆశ్రయించింది. ధవళేశ్వర సీఐ కె.మంగాదేవి ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించి, రెండు గంటల్లో ఆచూకీని కనిపెట్టి తల్లి వద్దకు చేర్చారు. బాలికను చర్చి నుంచి కొవ్వూరు మండలం ఐ.పంగిడి గ్రామంలో ఉన్న అమ్మమ్మ తీసుకువెళ్లినట్లు గుర్తించారు. ఆ బాలికను ధవళేశ్వరం తీసుకువచ్చి తల్లికి అప్పగించారు. ఎవ్వరికీ చెప్పకుండా బాలికను తీసుకువెళ్లవద్దని అమ్మమ్మకు కౌన్సిలింగ్ ఇచ్చారు. చర్చి వద్ద ఉన్న సీసీ కెమెరాలు ఆధారంగా బాలికను కనిపెట్టి తల్లి వద్దకు చేర్చిన ధవళేశ్వరం సీఐ మంగాదేవి, హెచ్‌సీ ఎస్.చంద్రశేఖర్, బి.శ్రీనివాసులను ఎస్పీ జగదీష్ అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేశారు.

బీసీలకు రాజ్యం.. జగనన్నకే సాధ్యం



చెల్లుబోయిన వేణు

రామచంద్రపురం రూరల్: బీసీలకు రాజ్యం జగనన్నకే సాధ్యం అని రాష్ట్ర బీసీ సంక్షేమ సినిమాటోగ్రఫీ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. నియోజకవర్గాల సమన్వయకర్తల రెండో జాబితా ప్రకటన సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 2014 ఎన్నికల సమయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో శెట్టిబలిజ సామాజిక వర్గానికి రెండు అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబును కోరగా.. సీట్లిస్తే మీ శెట్టిబలిజలు గెలుస్తారా అని శెట్టిబలిజ సామాజిక వర్గాన్ని చంద్రబాబు అవమానించి, అవహేళన చేశారన్నారు. నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రామచంద్రపురం అసెంబ్లీ స్థానాన్ని సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ తనయుడు సూర్యప్రకాష్‌కు, రాజమహేంద్రవరం రూరల్ స్థానాన్ని తనకు, పాలకొల్లు అసెంబ్లీ స్థానాన్ని గుడాల గోపి, రాజమండ్రి సిటీ స్థానాన్ని గీత బిడ్డ మార్గాని భరత్‌రామ్‌లను ఎంపిక చేయడం ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు.

అసలు పట్టాదారులకు న్యాయం చేయాలి

సీటీఆర్ఐ: భూములు కోల్పోయిన అసలు పట్టాదారులకు పరిహారం, ఆర్ఆర్ ప్యాకేజీ చెల్లించాలని ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారు అయినాపురపు సూర్యనారాయణ విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గోకవరం మండలం కృష్ణునిపాలెంలో ఎస్సీ కులస్థుల డి-ఫారం పట్టా వ్యవసాయ భూములను భూ సేకరణ అధికారులు చట్టవిరుద్ధంగా సేకరించారని చెప్పారు. 2019లో భూసేకరణ చేసినప్పటికీ, ఇప్పటికీ నష్ట పరిహారం చెల్లించలేదని, ఆర్అండ్ఆర్ వర్తింపచేయలేదని పేర్కొన్నారు. అసలు పట్టాదారులకు చట్ట ప్రకారం చెల్లించాల్సిన భూమి నష్ట పరిహారం వేరే వ్యక్తులకు చెల్లించారని చెప్పారు. దీనిపై ప్రభుత్వం విచారణ జరిపించి, ఈ అవకతవకలకు జరగడానికి బాధ్యులైన ఆరుగురు అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మాధవీలత నివేదిక సమర్పించారని వివరించారు. అధికారుల చర్యల వల్ల నష్టపోయిన బాధితులు ఎస్టీ కులస్థులైనందున అధికారులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని, ప్రభుత్వంపై ఉన్న నమ్మకాన్ని వమ్ముచేసినందుకు, అసలు పట్టాదారులను మోసగించినందుకు కేసులు నమోదు చేయాలని బాధితులు చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుందన్నారు. ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దిబ్బ శ్రీను, అబ్బయ్య, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందాలపై నిఘా : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో కోడి పందాలను నిర్వహించకుండా ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలని, ఎక్కడైనా పందాల కోసం బరులు ఏర్పాటు చేసే అవకాశం ఉన్న ప్రాంతాల్లో నిఘా పెట్టి, నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కె.మాధవీలత ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జేసీ తేజ్‌భరత్‌తో కలిసి సంక్రాంతి సందర్భంగా కోడి పందాలను నిరోధించడంపై డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లో కోడిపందాలు జరగడానికి వీల్లేదని, ఒకవేళ నిర్వహిస్తే విధించే శిక్షలపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించాలన్నారు. కోడి పందాలను అడ్డుకునే ప్రయత్నంలో భాగంగా డివిజన్, మండల, గ్రామ స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ కమిటీలో గ్రామ మహిళా సంరక్షణ అధికారి, వీఆర్వో, మండల కమిటీలో ఎస్‌హెచ్‌ఓ, తహసిల్దార్, సచివాలయ సెక్రటరీ, డివిజనల్ స్థాయి కమిటీలో డీఎల్‌పీఓ, ఎస్‌డీపీఓ, సబ్ కలెక్టర్ లేదా ఆర్డీఓ ఉంటారని తెలిపారు. డివిజన్, మండల స్థాయిల్లో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేయాలన్నారు. పండగ సెలవుల కారణంగా యువత, విద్యార్థులు కోడి పందాల్లో పాల్గొనే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలన్నారు. పండుగ దినాల్లో 144 సెక్షన్ అమలు చేస్తారన్నారు. ఇతర నిషిద్ధ ఆటలను ఉపేక్షించేది లేదన్నారు. వీటిపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. గతేడాది కోళ్ల పందాలకు స్థలాలిచ్చిన యజమానులను గుర్తించి, ముందుగా నోటీసులు జారీ చేయాలన్నారు. నిబంధనలను అతిక్రమించి పందాలు జరిగితే గ్రామ, మండల కమిటీలను బాధ్యులుగా చేస్తామని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని పోలీసులకు ఇవ్వాలని సూచించారు.

అందరికీ ఆరోగ్య భాగ్యం

- జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 శిబిరానికి విశేష స్పందన
- 514 మందికి వైద్య సేవలు
- సంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు



తొర్రేడులోని జగనన్న ఆరోగ్య సురక్ష 2.0లో మందులు పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ డా.మాధవీలత

రాజమహేంద్రవరం రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తొర్రేడు గ్రామ సచివాలయం-1లో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 వైద్య శిబిరంలో 514 మంది వైద్య సేవలు పొందారు. ఈ వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ డా.కె.మాధవీలత సందర్శించారు. వైద్య శిబిరంలో రోగులకు బీపీ, షుగరుతో పాటు, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.కె.సుధాకర్ నేతృత్వంలో కాతేరు పీహెచ్‌సీ వైద్యురాలు డా.ఈ.నాగదేవి, గైనకాలిజిస్ట్ డా.శ్రీఝాన్సీ, జనరల్ మెడిసిన్ డా.ఏ.ప్రియాంక వైద్య సేవలందించారు. ఐదుగురిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. హెచ్‌బీ 250, బీపీ 266, ఆర్‌బీఎస్ 136, ఈసీజీ పది మందికి పరీక్షించారు. రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. డీఎంహెచ్‌ఓ డా.కె.వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ డి.శ్రీనివాసరావు, తహసీల్దార్ పైడి చిన్నారావు, పంచాయతీ కార్యదర్శి చెరుకూరి రాణి, సొసైటీ అధ్యక్షులు చిట్టూరి వెంకటరావు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కొత్తపల్లి కేశవరామారావు, సొసైటీ మాజీ అధ్యక్షులు దండమూడి అర్జునరావు, పార్టీ నాయకులు దాసరి గోపాలకృష్ణ, గద్దె శ్రీనివాస చౌదరి, మిరియం నెహ్రూ, సత్తిపండు, రెడ్డి చంటి, మెప్పిలి రాజు, మర్రెడ్డి శ్రీనివాస్, మంగం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లజోడు ఇచ్చారు



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఒక వరం. మొదట విడత వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేశారు. అప్పుడు కళ్లజోడు పడుతుందని వైద్యులు చెప్పారు. రెండో విడత వైద్య శిబిరంలో కళ్లజోడు ఇచ్చారు. ఇప్పుడు అక్షరాలు బాగా కనపడుతున్నాయి.

– కేశవవరపు దుర్గ, తొర్రేడు

సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నా



ఈ వైద్య శిబిరంలో అన్ని పరీక్షలు నిర్వహించారు. ప్రతి నెలా క్రమంతప్పకుండా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో పరీక్షలు చేయించుకుంటున్నాం. అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం ఇస్తున్నారు. ఉచితంగా మందులు, పౌష్టికాహారం అందిస్తున్నారు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నట్టు వైద్యులు చెప్పారు.

– లక్ష్మీదేవి, గర్భిణి, తొర్రేడు

6న పడాల శత జయంత్యుత్సవం

ప్రకాశం నగర్: కేంద్ర సాహిత్య అకాడమీ(న్యూఢిల్లీ), ఏపీ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు, శతాధిక గ్రంథకర్త పడాల రామారావు శత జయంత్యుత్సవాలు ఈ నెల 6న స్థానిక కందుకూరి వీరేశలింగం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్టు అరసం జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ కర్రి రామారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 6న ఏపీ ప్రజానాట్య మండలి జిల్లా శాఖ కళాకారుల అభ్యుదయ గేయాలు, విభూతి బ్రదర్స్ బుర్రకథ ఉంటుందని చెప్పారు. పడాల రామారావు జీవితం-వ్యక్తిత్వంపై పెనుమాకుల భాస్కరరావు, పీజీ ఓబులేసు పత్రాలు సమర్పిస్తారన్నారు. అనంతరం పడాల రామారావు జీవితం-సాహిత్యం పుస్తకావిష్కరణ సభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కె.మాధవీలత, విశ్రాంత ఏపీ పోస్ట్‌మాస్టర్ జనరల్ ముత్యాల వెంకటేశ్వర్లు, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరవుతారని చెప్పారు. సమావేశంలో అరసం జిల్లా అధ్యక్షుడు పడాల వీరభద్రరావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎబెల్ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు



స్తంభాన్ని ఢీకొనడంతో దెబ్బతిన్న కారు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం తూర్పు రైల్వేస్టేషన్ నుంచి తాడితోట వైపు వెళుతున్న కారు అదుపుతప్పి ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ సంఘటన సోమవారం అర్ధరాత్రి జరిగింది. సమీపంలో ఉన్న అపార్ట్‌మెంట్ చప్టా ఎక్కిన కారు స్తంభంపైకి దూసుకెళ్లింది. వెంటనే కారులో బెలూన్లు ఓపెన్ కావడంతో అందులో ఉన్న భార్యాభర్తలు, ఇద్దరు పిల్లలు సురక్షితంగా బయటపడ్డారు. మంగళవారం ఉదయం విద్యుత్ అధికారులు కారును జేసీబీతో తొలగించి, విరిగిన స్తంభాన్ని తప్పించారు.

బంగారం చోరీ

కంబాలచెరువు: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళ బ్యాగులో బంగారం చోరీకి గురైన సంఘటనపై ప్రకాశ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. తణుకుకు చెందిన షేక్ హబీబున్నీసా విశాఖపట్నం వెళ్లింది. తిరుగు పయనంలో రాజమహేంద్రవరం వరకు బస్సులో ప్రయాణించింది. ఆమె బస్సు దిగి బ్యాగులో చూసుకునే సరికి 20 గ్రాముల బంగారు ఆభరణం కనిపించలేదు. ఈ మేరకు ఆమె ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.